భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

సికింద్రాబాద్ : సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాల భవన సముదాయాల నిర్మాణానికి ఎట్టకేలకు కదలిక వచ్చిందని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిధుల కొరతతో అర్ధంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ పాఠశాల, కళాశాల నిర్మాణానికి అవసరమైన రూ. 30 కోట్లు కేటాయించాలని కోరుతూ ఈ నెల 14న లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వివరిస్తూ మంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాసినట్లు తెలిపారు. మొత్తం మంజూరైన రూ. 30 కోట్లలో మొదటి విడత కింద రెండున్నర కోట్లు మాత్రమే విడుదలయ్యాయని, నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయన్నారు. అందువల్ల మిగిలిన నిధులు కూడా మంజూరు చేయాలని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు.

దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు



కార్యక్రమానికి హాజరైన రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్-3150 గవర్నర్ శరత్‌చౌదరి తదితరులు

సనత్‌నగర్: మానసిక దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రతిఒక్కరూ మానవత్వంతో ముందుకువచ్చి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్-3150 గవర్నర్ శరత్‌చౌదరి అన్నారు. అమీర్‌పేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ హాస్పటల్ ఫర్ జెనిటిక్ డిసీజెస్ ఆవరణలో మేథో వైకల్యం కలిగిన విద్యార్థుల పాఠశాల, శిక్షణ కేంద్రానికి రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో విస్తరాకుల తయారీ, ఫ్లోర్ మిల్ యంత్రాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన శరత్‌చౌదరి మాట్లాడుతూ వైకల్యం కలిగిన విద్యార్థులకు అపారమైన తెలివితేటలు ఉంటాయని, అయితే వారికి తగిన ప్రోత్సాహాన్ని అందించి వారిలోని ప్రతిభను వెలికితీయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, జెనిటిక్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ విజయలక్ష్మీ, ప్రొఫెసర్ పీపీరెడ్డి, జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి పాల్గొన్నారు.

‘సెయింట్ ఫ్రాన్సిస్’లో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

సనత్‌నగర్: బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి, ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరిశోధనా రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కు ఉన్న ఔచిత్యాన్ని ఆయన వివరించారు. హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఏఐలను సమీకృతం చేసే పరిశోధనలను కొనసాగించాలని కోరారు. ముఖ్యవక్తగా హాజరైన ఐసీటీ ప్రాజెక్ట్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిర్వహించే పాత్రను ఏఐ ద్వారా భర్తీ చేయడం సాధ్యం కాదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాజోసఫ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి వికసిత్ భారత్ థీమ్ ఏవిధంగా హైలెట్‌గా నిలుస్తుందో వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షిర్లీ, సెమినార్ కన్వీనర్ వాణిశ్రీ తాళ్లూరిలతో పాటు పలువురు నిపుణులు హాజరై పలు అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో 34 పరిశోధనా పత్రాలను కలిగి ఉన్న ఐఎస్‌బీఎన్ పుస్తకం ప్రాధాన్యత గురించి వక్తలు వివరించారు.

టీపీసీ బోర్డు సభ్యుడిగా యాదగిరి



నియామకపత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

సికింద్రాబాద్: టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ బోర్డు సభ్యుడిగా సికింద్రాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత యాదగిరి నియామితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా నియామకపత్రాన్ని తీసుకున్నాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్లు జగదీశ్వర్ రావు, సురేష్ లాల్, జహంగీర్, రాజు, పాపాలాల్, రేవంత్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన బీజేపీ నేతలు

లాలాపేట: లాలాగూడ పోలీసు స్టేషన్ నూతన స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రఘుబాబును మంగళవారం తార్నాక డివిజన్ బీజేపీ నాయకులు పోలీసు స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎస్. వెంకటేష్‌గౌడ్, తార్నాక డివిజన్ బిజేపి అధ్యక్షుడు రాము వర్మ, గోవర్ధన్, శశికాంత్ తదితరులున్నారు.



సర్వేకు సర్కార్ ఉపాధ్యాయులు వద్దు



సమావేశంలో పాల్గొన్న ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు

అడ్డగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ‘సమగ్ర కుటుంబ సర్వే’ లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సేవలను మినహాయించాలని ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆజాద్ చంద్రశేఖర్‌నగర్‌లో ఏర్పాటు బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టాన్ని, బాలల విద్యను దృష్టిలో ఉంచుకొని సర్వేలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను తొలగించాలన్నారు. ఉపాధ్యాయులు లేని కారణంగా పాఠశాలలను ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే నిర్వహించడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు ఇప్పటికే తగ్గుతున్న విశ్వాసాన్ని ఈ ఆదేశాలు మరింత దెబ్బతీస్తాయన్నారు. సమావేశంలో సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ లక్ష్మీనారాయణ, చిన్న వీరయ్య, గోపాల్, భాస్కర్, దివ్య, శ్రీకాంత్, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి

రసూల్‌పురా: దేశానికి నాలుగు సార్లు ప్రధానిగా సేవలందించిన ఇందిరాగాంధీ పేద ప్రజల అభ్యున్నతికి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని సమర్థవంతంగా అమలు చేశారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకుని రసూల్‌పురాలోని ఇందిరా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలసి శ్రీగణేష్ పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకులను జాతీయం చేసి పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చారని గరీబీ హటావో నినాదంతో రోటి, కపడా ఔర్ మకాన్ అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శాంసన్ రాజు, వినోద్, సరిత, అన్నానగర్ మురళి, జమీల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

బన్సీలాల్‌పేట్: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను బన్సీలాల్‌పేట్ డివిజన్ బోయిగూడలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లం రమేష్, డి. శ్రీనివాస్, వీఎస్ నారాయణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



బోయిగూడలో ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



చెరువుకు మహర్దశ

తార్నాక ఎర్రకుంట చెరువు పునరుద్ధణకు కదిలిన హైడ్రా

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని ఎర్రకుంట చెరువు పునరుద్ధరణ పనులు మంగళవారం చేపట్టారు. నిజాం కాలం నాటి లాలాగూడ గ్రామ పరిధిలో దాదాపు 26 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎర్రకుంట చెరువు ప్రస్తుతం కబ్జా కోరల్లో చిక్కుకుంది. తార్నాకలోని నాగార్జున కాలనీ సంక్షేమ సంఘం, చెరువుల పరిరక్షణ సమితి, ఇలా పలువురు చేసిన ఫిర్యాదులతో ఇటీవల హైడ్రా కమిమీషనర్ రంగనాథ్ తార్నాక ఎర్రకుంట చెరువును సందర్శించి పరిశీలించారు. గతంలో దాదాపు 6 ఎకరాల విస్తీర్ణంలో(5.90) ఎఫ్‌టీఎల్‌గా నిర్ధారించిన భూముల్లో చెరువు పునరుద్ధరించి అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకు అనుగుణంగా మారేడుపల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ పర్యవేక్షణలో ఇరిగేషన్ ఏఈ సుధీర్‌కుమార్ నేతృత్వంలో అధికారులు, డీఆర్ఎఫ్ బృందాలు రెండు ప్రొక్లెయిన్‌ల సహాయంతో చెరువు భూముల్లో పెరిగిన చెట్లను, తొలగించే పనులు చేపట్టారు.

స్థానికుల హర్షం

తార్నాక ఎర్రకుంట చెరువును అభివృద్ధి చేసేందుకు మంగళవారం ఉదయమే అధికారులు డీఆర్ఎఫ్ బృందంతో పాటు రెండు జేసీబీలతో చెరువు వద్దకు కదలి రావడంతో దాదాపు 30, 40 ఏళ్ల నుంచి చెరువు భూములను ఆక్రమించిన భూ కబ్జాదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మరో వైపు చెరువు అభివృద్ధిని తార్నాకలోని పలువురు కాలనీ సంక్షేమ సంఘాలు, ఎర్రకుంట బస్తీ వాసులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు భూములు, చెరువు తూముపై వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట్, లోధా, హెచ్‌పీఎస్ సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత్‌కాలనీ, బల్కంపేట్, బీకేగూడ మసీదు, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, డీఎస్‌ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్ట్, టీవీఎస్ షోరూంలేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీమార్ట్ ఎదురు ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాతాచారికాలనీ, బొంబే అల్వా కాంపౌండ్, పోచమ్మ బస్తీ, ఆర్‌బీఐ క్వార్టర్స్, వాణి ప్రింటర్స్ ఏరియా, గురుమూర్తిలేన్, సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా, డీమార్ట్ ఏరియా, టయోటా షోరూం లేన, స్కోడా షోరూం లేన్, జెన్ టెక్నాలజీ ఏరియా, ఆంధ్రబ్యాంక్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: ఉస్మానియా యూనివర్శిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 20న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సబ్ డివిజన్ ఏడీఈ ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కేశవనగర్ ఫీడర్ పరిధిలోని కేశవనగర్, స్కైల్యాబ్, సువర్ణ అపార్ట్‌మెంట్, రైల్వే వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు రవీంద్రనగర్ ఫీడర్ పరిధిలో రవీంద్రనగర్, మోడల్ స్కూల్, పీటీ దోబి ఘాట్, ఈఎఫ్ఎల్ బ్యాక్‌సైడ్, మాణికేశ్వరీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా 27, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 60, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 23, పందిరి బీర 38, క్యాబేజీ 31, క్యారెట్ 65, దొండ 23, గుండుబీన్స్ 53, గింజ చిక్కుడు 60, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 33, బీట్‌రూట్ 55, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 37, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రారంభం

రసూల్‌పురా: న్యూబోయిన్‌పల్లి హస్మత్‌పేట రోడ్డులో ది ఆదర్శ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 26వ శాఖను బుధవారం ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ జి. మదన గోపాల స్వామి మంగళవారం తెలిపారు. 1998లో మొదటి బ్రాంచ్‌ను జీడిమెట్లలో ప్రారంభించామని నగరంలో ఇప్పటికే 24 శాఖల ద్వారా ఖాతాదారులకు సేవలందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈవో వెంకటర మణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నేడు శాంతినగర్‌లో ఉచిత వైద్య శిబిరం

లాలాపేట: తబితా స్త్రీ, శిశు సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం శాంతినగర్‌లోని షీబాలత హైస్కూల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆశ్రమ డైరెక్టర్ ఏలిషమ్మ అహరోన్ తీగుళ్ల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగబాలు డిమాండ్ చేశారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఆర్ఎస్వీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ అంశాలు, సమస్యల పై చర్చించి తక్షణం నిధులు విడుదలచేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు. స్వామియాదవ్, నవీన్‌గౌడ్, జంగయ్య, శ్రీకాంత్‌గౌడ్, కొంపల్లి నరేష్, రమేష్, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో వివరాలు అందించిన డిప్యూటీ మేయర్

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాతంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి తమ కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్లకు అందజేశారు. సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంసీ హేమలత, ఎన్యూమరేటర్లు తార్నాకలోని డిప్యూటీ మేయర్ నివాసానికి వెళ్లి సర్వే ఫారాన్ని అందజేశారు. ఫారాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసి అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను నమోదు చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి

డీఎంఆర్‌కేఎస్‌కు సంపూర్ణ మద్దతు



సమావేశంలో పాల్గొన్న దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: రైల్వేలో ట్రేడ్ యూనియన్ల గుర్తింపు కోసం నిర్వహించనున్న ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘ్(డీఎంఆర్‌కేఎస్)కు తమ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు ఎఫ్రాయిమ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్ సమీపంలోని తమ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే కార్మికుల సంక్షేమంతో పాటు న్యాయపరమైన హక్కుల సాధనకు కృషి చేస్తున్న డీఎంఆర్‌కేఎస్ కు కార్మికులందరూ మద్దతు నివ్వాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జోనల్ ప్రధాన కార్యదర్శి పాపారావు, డీఎంఆర్‌కేఎస్ ప్రధాన కార్యదర్శి శశిధరణ్, కోశాధికారి ఏవీఎన్. రమేష్ బాబు, కన్వీనర్ శివకుమార్, డివిజనల్ సెక్రటరీ విష్ణువందన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు, మహిళ భద్రత చాలా ముఖ్యం

రాంగోపాల్‌పేట్: విద్యార్థినిలు, మహిళల భద్రత తమకు ఎంతో ముఖ్యమని విమెన్ సేఫ్టీ వింగ్ షీ మ్యాడ్యుల్ ఎస్పీ లక్ష్మి అన్నారు. మంగళవారం లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ కీస్ హైస్కూల్‌లో వార్షిక చైల్డ్ లైన్ సేఫ్టీ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలకు వ్యక్తిగత భద్రత నేర్పించడం, బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించడమే క్లబ్ లక్ష్యమని అన్నారు. అనంతరం విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శేఖర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ హరీష్, లెర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కౌముది నాగరాజు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ లక్ష్మి

మాలల సింహగర్జనను విజయవంతం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్ మంగళవారం పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో పాటు టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీసి బహుజన ఉద్యమాలను బలహీన పర్చాలని కుయుక్తులు పన్నారని ధ్వజమెత్తారు. మనువాద బీజేపీ, టీడీపీ కుట్రలను తిప్పికొట్టి దళితుల ఐక్యత కోసం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బహుజన రాజ్యాధికారం కోసం డిసెంబర్ 1న జరిగే సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు.



తల్లమల్ల హసేన్

ఓయూలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మంగళవారం క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మన్ ముఖ్యఅతిథులుగా హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.గ్యార నరేష్, చైతన్య, ఓయూ అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, నెల్లి సత్య, భగత్ పాల్గొన్నారు.

వైభవంగా పునఃప్రతిష్ఠాపనోత్సవం



అంబర్‌పేట: బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన మహోత్సవం కనులపండువగా కొనసాగుతోంది. మంగళవారం అంబర్‌పేట మహంకాళి ఆలయం ఎదురుగా పునః ప్రతిష్ఠిస్తున్న బొడ్రాయి కార్యక్రమం వైభవంగా జరిగింది. గణపతి, నవగ్రహ వంటి పూజా కార్యక్రమాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. నిర్వాహకులు వై.శంకర్‌గౌడ్, రాజు, మల్లికార్జున్‌గౌడ్, సుధాకర్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆవేదన..

మహాలక్ష్మి పథకం ప్రారంభమైన తరువాత తమ పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు. తన ఆవేదనను ప్రజలకు, ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఏకంగా ఓ ఆటో డ్రైవర్ తన ఆటో వెనకాల ఇలా రాసాడు..అన్నా రేవంతన్నా జర మమ్ముల్ని కాపాడు. ఫ్రీ బస్ సర్వీస్ రద్దుచేసి మా ఆటో డ్రైవర్లను కాపాడండి అని కోరాడు. తార్నాకలో మంగళవారం ఓ ఆటో వెనుక ఇలా కనిపించింది. -లాలాపేట



ప్రిన్సిపల్ ప్రొ.కాశీం అందరివాడు



ప్రొ.కాశీంకు అభినందనలు తెలుపుతున్న శ్రీనివాస్ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కళాశాలకు ప్రిన్సిపల్‌గా నియమితులైన ప్రొ.కాశీం అందరివాడని ఎమ్మార్పీఎస్-టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ పేర్కొన్నారు. మంగళవారం ప్రొ.కాశీంకు పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, తెలంగాణ ఉద్యమం, వామపక్ష, స్త్రీ, విప్లవ ఉద్యమాలతో పాటు అనేక సభలలో పాల్గొని ప్రసంగించిన ప్రొ.కాశీం తన బోధన, పరిశోధనలతో విద్యార్థులను ఆకట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో మాదిగ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు వెంకట్, నాయకులు రాజేష్, చందు, గుమ్మడి తిరుమలేష్, సురేష్, శ్రీకాంత్, మని, ఫని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



పవర్ బోర్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎల్ఎన్ నగర్‌లో నూతనంగా పవర్ బోర్ పనులను ఆమె ప్రారంభించారు. స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంది నారాయణ, శ్రీధర్, బాబు, జగన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థుల ర్యాలీ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. మంగళవారం బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, కొంపల్లి నరేష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా పాలనా భవనం చేరుకొని ఓఎస్‌డీ ప్రొ.జితేందర్ నాయక్‌కు హాస్టళ్ల సమస్యలను వివరించి పరిష్కరించాలని వినతి పత్రం సమర్పించారు.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే



రసూల్‌పురా : సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో ప్రజల తాగునీటి అవసరాలకనుగుణంగా ఒక ఎంజీడి అదనంగా పెంచడంతో పాటు నియోజకవర్గంలో సీవరేజ్ ఆధునీకరణ, పికెట్, హస్మత్‌పేట నాలాల అభివృద్ధికి 303.64 కోట్ల విడుదలకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

బ్లేడుతో దాడిచేసిన ఏడుగురి అరెస్ట్

రసూల్‌పురా: బ్లేడ్‌తో దాడికి పాల్పడిన ఏడుగురు యువకులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐ శివ శంకర్ తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన నితిన్, చందన్ కుమార్ తమ బొలేరో వాహనాన్ని జీవీఆర్ గార్డెన్స్ సమీపంలో ఉన్న హోల్‌సేల్ ఆన్ వీల్ సంస్థలో బాడుగకు నడుపుకుంటున్నారు. అదే సంస్థలో పనిచేస్తున్న బోయిన్‌పల్లి ఆనంద్‌నగర్‌కు చెందిన అరవింద్, సాయి, తేజ, ఖాన్ ఫైజాన్, బన్నీలతో పాటు మరో ఇద్దరు యువకులు ఆదివారం అర్ధరాత్రి ఓ పార్సిల్ పంపే విషయంలో ఫోన్‌లో నితిన్. చందన్‌తో గొడవ పడి దుర్భాషలాడారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వీరు జీవీఆర్ గార్డెన్స్ ప్రాంతం వద్దకు చేరుకుని నితిన్, చందన్‌కుమార్‌ను పిలిపించారు. ఇరువర్గాల మధ్య మాటా..మాట పెరిగి ఒకరినొకరు తోసుకున్నారు. ఈ క్రమంలో సాయి అనే యువకుడు తన వద్ద ఉన్న బ్లేడుతో దాడి చేసి పారిపోయాడు. తీవ్రంగా గాయలైన నితిన్ చందన్‌లు బోయిన్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారిని చికిత్స కోసం ఆసుపత్రిని తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడ్డ సాయితో పాటు సహకరించిన ఏడుగురిని మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వృద్ధురాలి అదృశ్యం



నల్లకుంట: ఆర్థికపరమైన విషయంలో భార్యాభర్తల మధ్య జరిగిన చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చేసింది. ఎస్ఐ కృష్ణ తెలిపిన వివరాలు.. ఆటో డ్రైవర్ ఇస్లావత్ గోవింద భార్య ఇస్లావత్ లకమ్మ(60)తో కలిసి అడిక్‌మెట్‌లోని భవాని హోటల్ సమీపంలో నివాసముంటున్నారు. ఈనెల 18న ఉదయం డబ్బుల విషయంలో భార్యాభర్తలిద్దరు గొడవపడ్డారు. అనంతరం గోవింద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వచ్చి చూడగా ఇంట్లో భార్య కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినప్పటికీ భార్య ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన గోవింద్ తన భార్య కనిపించడం లేదంటూ మంగళవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన నల్లకుంట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.